భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL



# కాళోజీ సేవలు చిరస్మరణీయం: అదనపు కలెక్టర్ నగేష్



**భారత్ సమాచార్, మెదక్ జిల్లా**: తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేస్తూ ప్రజలను చైతన్యపరిచిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు అని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్, ఎస్సీ సంక్షేమ అధికారి సింధుతో పాటు కలెక్టరేట్ కార్యాలయ సూపరింటెండెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. తెలంగాణ మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, వారి భాష, యాస, సామాజిక సమస్యలను తన రచనల్లో ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. సమాజంలోని సమస్యలను నిర్భయంగా తన రచనల ద్వారా ప్రశ్నించిన కాళోజీ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

కాళోజీ చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనను పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందని అదనపు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ పుట్టినరోజును ‘తెలంగాణ భాషా దినోత్సవం’గా ప్రకటించి ప్రతి సంవత్సరం అధికారికంగా జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కాళోజీ సాహిత్యం, ఆయన ఆశయాలు, ప్రజా చైతన్యానికి చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాళోజీ నారాయణరావు ఆశయాలను, తెలంగాణ భాషా వైభవాన్ని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

© 2026 Bharath Samachar